

ప్రజల కృషితోనే ఐఎస్‌ఓ గుర్తింపు
ఆరోగ్య, స్వచ్ఛ, హరిత సిద్దిపేటగా మారడంలో ప్రజల కృషి ఉందని ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఒకేసారి మూడు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు సాధించడం గొప్ప విషయమన్నారు. 8లో

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికి కృషి



రైతు బజార్‌లో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతీ నగర్ డివిజన్ పరిధిలో గురువారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ శంకరయ్య పర్యటించారు. డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతు బజార్, వార్డు కార్యాలయంలో జరుగుతున్న పనులను పరిశీలించి మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ఆయనకు వినతిపత్రం అందించారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ శంకర్, నాయకులు వెన్నవరం ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావి ఆకుపై కేసీఆర్ చిత్రపటం



నారాయణఖేడ్: బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఈనెల 17తో 69వ వసంతంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో సీఎంకు నారాయణఖేడ్ మండలం అనంతసాగర్‌కు చెందిన చిత్రకారుడు గుండు శివకుమార్ ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. రావిఆకుపై కేసీఆర్ చిత్రాన్ని మలచి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

స్వయం ఉపాధికి దరఖాస్తు చేసుకోండి

సంగారెడ్డి టౌన్: దివ్యాంగులు స్వయం ఉపాధి పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో స్వయం ఉపాధి పథకం ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొంది సాధారణ జీవనాన్ని గడపాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు మొత్తం 38 యూనిట్లు మంజూరయ్యాయని, బ్యాంకు లింకేజీ లేకుండా రూ.50 వేల ఆర్థిక సహాయానికి 35 యూనిట్లు, బ్యాంకు లింకుతో రుణాలు మూడు యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. వీటి కోసం ఈ నెల 28వ తేదీలోగా https://tsobmms.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువు నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని జగన్నాథ్‌పూర్‌లో కొత్తగా చెరువును నిర్మించనున్నారు. శనివారం ఆర్థిక మంత్రి హరీశ్‌రావు భూమి పూజ చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నీటిపారుదల శాఖ సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ మురళీధర్, ఈఈ జైభీం, డీఈఈలు రవికుమార్, జలంధర్ తదితరులతో కలిసి చెరువు నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. నిర్మాణానికి సేకరించిన భూమి, ఆయకట్టు సాగు వివరాలపై సమీక్ష నిర్వహించారు.

కేతకి జాతరకు రూ.10 లక్షలు మంజూరు

డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకి సంగమేశ్వర ఆలయ మహాశివరాత్రి జాతరకు రూ.10 లక్షలు మంజూరు అయినట్లు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ గురువారం పేర్కొన్నారు. జాతర నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి మంజూరు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ డాక్టర్ శరత్ జహీరాబాద్ ఆర్డీఓ రమేశ్‌బాబుకు నిధుల మంజూరు ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. జాతర నిర్వాహణకు నిధులు మంజూరు చేయడంతో మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

వెట్టి.. వేధింపులు!

- 62 ఏళ్ల వృద్ధులూ పని చేయాల్సిందే..
- రోజుకు 13 నుంచి 16 గంటల పని
- 3,000 ఇటుకలు చేయాలని టార్గెట్
- వెలుగులోకి ఇటుక బట్టీ యాజమాన్యం ఆగడాలు



ఇటుక బట్టీలో పనిచేసేందుకు వచ్చిన ఒడిశా కూలీలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నిజాంపేట్ ఇటుకబట్టి నిర్వాహకుల ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఇటుక బట్టీలో కూలీలపై లైంగిక వేధింపులకు పాల్పడటమే కాకుండా, వెట్టి చాకిరి చేయిస్తున్నారని కొందరు కూలీలు వాపోయారు. కేవలం బాల కార్మికులతోనే కాకుండా 70 ఏళ్ల వృద్ధులతో కూడా యాజమాన్యం పనులు చేయించినట్లు ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రోజుకు 13 నుంచి 16 గంటలు పని చేయాలని యజమానులు బలవంతం చేశారని కూలీలు ఆరోపిస్తున్నారు. రోజుకు మూడు వేల ఇటుకలు చేయాలని టార్గెట్ పెట్టేవారని అధికారులకు తెలిపారు. ఆరోగ్యం బాగాలేక విశ్రాంతి తీసుకుంటే కూడా యాజమాన్యం వేధింపులకు పాల్పడినట్లు కూలీలు పేర్కొన్నారు.

- నిజాంపేట్ మండలం దర్గాతాండా శ్రీరాం ఇటుక బట్టీలో ఒడిశా రాష్ట్రానికి చెందిన 58 కార్మికులు ఉన్నారు. వారిలో కొందరు బాలికలపై వేధింపులకు పాల్పడిన ఘటన బుధవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ ఆగడాలపై ఓ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. బుధవారం ఇటుకబట్టిపై దాడులు చేసి కూలీలకు విముక్తి కల్పించారు. బట్టి యజమానులు ఏ.శంకర్, ఏ.పరమేశ్, గంగారాం, రమేశ్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ బట్టి యాజమాన్యం ఆగడాలు అన్నీ ఇన్నీ కావని కూలీలు అధికారులతో వాపోయారు.

కుటుంబ సభ్యులు చనిపోయినా పోనివ్వలేదు

ఇటుక బట్టీలో పనిచేస్తున్న ఓ కూలీకి సంబంధించి అమ్మమ్మ తన స్వస్థలం ఒడిశాలో మరణించారు. ఆకరి చూపు కోసం తమ స్వస్థలానికి వెళ్తానంటే కూడా బట్టి యజమానులు అనుమతించలేదని కూలీలు వాపోయారు. బలవంతంగా తమతో పని చేయించారని కూలీలు అధికారుల దృష్టికి తెచ్చారు. ఘటనలో రెవెన్యూ అధికారుల తీరు విమర్శలకు దారితీసింది. బట్టి యాజమాన్యం వెట్టి చాకిరి నిర్మూళన చట్టం నిబంధనలను అతిక్రమించి కూలీలతో పని చేయిస్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినప్పటికీ రెవెన్యూ అధికారులు ఈ చట్టం ప్రకారం కేసు నమోదు చేయకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఈ విషయమై 'సాక్షి' నిజాంపేట్ తహసీల్దార్ మదన్‌ను సంప్రదించగా వెట్టి చాకిరి చేయిస్తున్నట్లు కూలీలు తమతో చెప్పలేదని పేర్కొన్నారు. అందుకే తాము ఈ చట్టం కింద కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఏడుగురు చిన్నారులకు వైద్య పరీక్షలు


ఈ కూలీల్లో ఏడుగురు బాల కార్మికులపై కూడా లైంగిక వేధింపులకు పాల్పడినట్లు అధికారుల దృష్టికి రావడంతో వారిని జిల్లా కేంద్రంలోని బాలసదన్‌కు తరలించారు. వారికి సంగారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడుగురు మినహా మిగిలిన కూలీలను బుధవారం రాత్రి రైలులో ఒడిశాకు పంపారు. వైద్య పరీక్షల అనంతరం వీరిని వారి స్వస్థలాలకు పంపుతామని స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు పేర్కొన్నారు. నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం విదితమే.



శ్రీరాం ఇటుక బట్టి

హ్యూమన్ రైట్స్ కమిషన్‌కు ఫిర్యాదు

దళిత కూలీలపై జరిగిన దాష్టికాలపై స్వచ్ఛంద సంస్థ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసింది. దీనిపై త్వరలోనే జిల్లా ఉన్నతాధికారులకు మానవ హక్కుల కమిషన్ నుంచి ఆదేశాలు అందే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.



మైత్రి మైదానంలో ముస్తాబు అవుతున్న 50 అడుగుల శివలింగం

'మైత్రి'లో మినీ కైలాసం

50 అడుగుల భారీ శివలింగం.. 15 అడుగుల ధ్యానముద్రలో శివుడు

పటాన్‌చెరు: మహాశివరాత్రిని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలో మొట్టమొదటిసారిగా మహా జాగరణ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కార్యక్రమ వివరాలను వెల్లడించారు. పరమశివుడి నివాసమైన కైలాసగిరిని మరిపించేలా పర్వతాలు, 50 అడుగుల శివలింగం, 15 అడుగుల ధ్యానముద్ర శివుడి విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి వేద బ్రాహ్మణులచే మహన్యాస అభిషేకం, పల్లకీ ఊరేగింపు, పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రముఖ సినీ గాయకులు వందేమాతరం శ్రీనివాస్, ఎస్పీ చరణ్, సునీత, సుమంగళి, గద్దర్ నరసింహ, మౌనిక యాదవులతోపాటు ప్రముఖ తెలుగు వ్యాఖ్యాత సుమ కనకాల, తెలంగాణ యాస, భాషకు ప్రతిరూపమైన బిత్తిరి సత్తి, తదితర కళాకారులతో సంగీత విభావరి, సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తుల సంఖ్యకు అనుగుణంగా సీటింగ్ సదుపాయం, మంచినీరు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల వాహనాల కోసం సాకి చెరువు కట్ట, ప్రభుత్వ ఆస్పత్రి, బ్లాక్ ఆఫీస్, రహదారి బంగ్లా తదితర ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులందరూ సకాలంలో కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కొమురవెల్లిలో పటిష్ట బందోబస్తు



పార్కింగ్‌ను పరిశీలిస్తున్న మహేందర్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహించే పెద్ద పట్నానికి పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లుగా అడిషనల్ డీసీపీ మహేందర్ తెలిపారు. గురువారం ఆలయ పరిసర ప్రాంతాలలు, పార్కింగ్ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఆలయ ఆవరణలో మొత్త 80 సీసీ కెమెరాల ద్వార నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరులో సామూహిక వివాహాలు

పటాన్‌చెరు: దాతృత్వానికి, మంచితనానికి మారుపేరుగా నిలిచిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మరో నిర్ణయం తీసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో సామూహిక వివాహాలు జరిపించేందుకు నిర్ణయించారు. గురువారం పట్టణంలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సామూహిక వివాహాల కార్యక్రమ వివరాలను వెల్లడించారు. అభివృద్ధితో పాటు ప్రజలకు సేవలు అందించడంలో భాగంగా తమ కుటుంబం ఆధ్వర్యంలో జీఎంఆర్ ఎంటర్ ప్రైజెస్ సౌజన్యంతో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా సామూహిక వివాహ కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పుర ప్రముఖులు, వేద బ్రాహ్మణులతో చర్చించిన అనంతరం మే 7వ తేదీ, ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాలులో సంప్రదాయబద్ధంగా సామూహిక వివాహాలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. అర్హులైన హిందువుల జంటలు తమ మండలాల పరిధిలోని ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో పేర్లను నమోదు చేసుకొని రసీదులు పొందాలని సూచించారు. వివాహం చేసుకున్న జంటలకు ప్రభుత్వం తరఫున కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వర్తిస్తాయన్నారు. తాను ఎంపీపీగా పని చేసినప్పుడు 20 జంటలకు సామూహిక వివాహాలు జరిపించినట్లు గుర్తు చేశారు. మొదటగా హిందువుల సామూహిక వివాహాలు జరిపించిన అనంతరం, ముస్లిం, క్రిస్టియన్ల మత పెద్దలతో చర్చించి వారికి సంబంధించిన సామూహిక వివాహాల తేదీని ప్రకటిస్తామన్నారు.

'ధరణి' ప్రక్రియ బాగుంది



దత్తాత్రేయ స్వామిని దర్శించుకుంటున్న ఎన్నికల కమిషన్ అధికారులు

హత్నూర(సంగారెడ్డి): తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి ప్రక్రియ బాగుందని ఢిల్లీ ఎలక్షన్ కమిషన్ అధికారులు తెలిపారు. గురువారం మెదక్ జిల్లా చిట్కుల్ చాముండేశ్వరి ఆలయంలో పూజలు చేసిన ఢిల్లీ ఎలక్షన్ కమిషన్ డిప్యూటీ చీఫ్ ఎన్నికల అధికారి ప్రిలావెల్, శ్రీధర్‌లు నియోజకవర్గ కేంద్రమైన నరసాపూర్‌కు వెళ్తుండగా మార్గ మధ్యలో హత్నూర తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయం వద్ద పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగుడి ఉండటంతో తహసీల్దార్ పద్మావతిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూముల రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు కార్యాలయం వద్ద ఉన్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో రైతుల ఇబ్బందులు తగ్గినట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ రోజే పట్టాదారు పాస్ పుస్తకాలు, రిజిస్ట్రేషన్ పత్రాలను భూముల క్రయవిక్రయదారులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. అంతేకాకుండా భూ సమస్యలను సైతం ధరణి పోర్టల్ ద్వారా సత్వరం పరిష్కరించేందుకు వీలుందని తెలిపారు. అక్కడి నుంచి మాధుర దత్తాత్రేయా క్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థులు చదువులో పోటీ పడాలి

జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ



జెడ్పీ చైర్‌పర్సన్‌ను ఆహ్వానిస్తున్న విద్యార్థినులు

నారాయణఖేడ్: విద్యార్థులు చదువులో పోటీ పడుతూ చదవాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయని జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ అన్నారు. నారాయణఖేడ్ మండలం ర్యాకల్ రైతు వేదికలో గురువారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లద్దాలను తొడిగారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బాగా చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్‌నాయక్, ఎంఈఓ విశ్వనాథం, సర్పంచ్ పట్లోళ్ల సుజాత, మాజీ విజిలెన్స్ కమిటీ సభ్యులు రవీందర్‌నాయక్, వైద్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల



గంగ్వార్ గ్రామంలో ఓ కార్యకర్త ఇంట్లో అల్పాహారం తీసుకుంటున్న మంత్రి

న్యాల్‌కల్(జహీరాబాద్): ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కేంద్ర పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. పార్లమెంటరీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా గురువారం న్యాల్‌కల్ మండల పరిధిలోని గంగ్వార్ గ్రామంలో పర్యటించారు. గ్రామానికి వచ్చిన మంత్రికి మహిళలు హారతి ఇచ్చి తిలకం దిద్ది గ్రామంలోకి ఆహ్వానించారు. గ్రామంలో బీజేపీ బూత్ కమిటీని ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలకు కండువాలు కప్పి ఆహ్వానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అవి ప్రజలకు తెలియడం లేదని, వాటిని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. గ్రామ స్థాయిలో బీజేపీకి మంచి స్పందన వస్తోందని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు నరేందర్, సుగుణాకర్‌రావు, జయశ్రీ, రామకృష్ణ, నవ జగన్, నటరాజన్ గౌడ్, జనార్ధన్‌రెడ్డి, సుదీర్‌కుమార్, సుధీర్ బండారీ, రాంచందర్, రాజ నర్సింహ, శ్రీనివాస్ గుప్తా, శ్రీకాంత్, ప్రభాకర్‌చారి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, మహేశ్, ఏక్‌నాథ్ పాటిల్, ఓంకార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

జహీరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధతకి పార్లమెంట్‌లో చట్టం ఆమోదం కోసం తమ వంతు కృషి చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలను కోరారు. గురువారం ఈ మేరకు వారు మంత్రికి వినతిపత్రం అందజేశారు. తొమ్మిదేళ్ల క్రితం బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో సైతం చేర్చారన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ బిల్లును ఆమోదించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు అబ్రహం మాదిగ, జైరాజ్, ఉల్లాస్, కిట్టు, విజయ్, బబ్లూ, సూర్యకాంత్ పాల్గొన్నారు.

రాజకీయ జాగ'రణం'

- అధికార పక్షంలోనే రెండు గ్రూపులు?
- పటాన్‌చెరు బీఆర్‌ఎస్‌లో పోటాపోటీగా కార్యక్రమాలు
- ఫ్లెక్సీల చించివేతతో గ్రామాల్లో ఉద్రిక్తత



బీరంగూడలో ఫ్లెక్సీలను తొలగించిన దృశ్యం

పటాన్‌చెరు: పారిశ్రామికవాడలో రాజకీయాలు వేడెక్కాయి. ఈ ఏడాది చివర్లో శాసన సభ ఎన్నికలు రానున్న సందర్భంలో ఈ ప్రాంతంలో నేతలు ప్రజలకు దగ్గరయ్యేందుకు అటు తమ తమ పార్టీల పెద్దల కన్నుల్లో పడేందుకు ప్రతీ అవకాశాన్ని వాడుకుంటున్నారు. కొద్ది నెలలుగా ప్రతి పండగ, దివంగత నేతల జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్‌లు పోటాపోటీగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా శివరాత్రి ఉత్సవాలకు ఆ నాయకులిద్దరూ పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. జాగరణ కార్యక్రమానికి టీవీ యాంకర్లను, ప్రముఖ కళాకారులను ఆహ్వానిస్తున్నారు. శివరాత్రి జాగరణకు పటాన్‌చెరు చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన దాఖలాలు లేవని ఈ ప్రాంతవాసులు చర్చించుకుంటున్నారు.

- కొద్ది నెలల క్రితం చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలకు మంత్రి కేటీఆర్ వస్తున్నారని నీలం మధు యువసేన ముమ్మర ప్రచారం చేసింది. అదే రోజున ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కూడా చాకలి ఐలమ్మ కార్యక్రమాలు జరిగాయి. ఆ ఒక్క సందర్భంలోనే కాకుండా దసరా, రంజాన్, వినాయక నవరాత్రి, మహానేతల జయంతులు, వర్ధంతులు.. ఇలా ప్రతి సందర్భంలోనూ బీఆర్‌ఎస్ నేతలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహించారు. పటాన్‌చెరులో బీఆర్‌ఎస్‌లో రెండు గ్రూపులు ఏర్పడ్డాయా అనేంతగా గందరగోళ పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి.
- ఆయా సందర్భాల్లో ప్రజలను మచ్చిక చేసుకునేందుకు కాంగ్రెస్‌తో పాటు బీజేపీ వర్గాలు కూడా వివిధ ఆధ్యాత్మిక చింతన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వివిధ సందర్భాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం ఈ ప్రాంతంలో ఆనవాయితీగా మారింది. వేసిన ఫ్లెక్సీలను నిబంధనల పేరుతో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో అధికారులు తొలగిస్తూ వస్తున్నారు. తాజాగా శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆయా గ్రామాల్లో మున్సిపాలిటీల్లో తొలగిస్తున్నారు. బీఆర్‌ఎస్ నేత నీలం మధు ముదిరాజ్ వేసిన ఫ్లెక్సీలను తొలగించడం తీవ్ర దుమారం రేపుతోంది. అన్ని గ్రామాల్లోనూ బీఆర్‌ఎస్ కార్యకర్తల్లో ఈ అంశంపై చర్చ జరుగుతోంది. ఫ్లెక్సీల తొలగింపుపై నీలం మధు యువసేన నాయకులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. నిబంధనల మేరకే ఫ్లెక్సీలను తొలగించినట్లు అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరుటౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళ, బుధ వారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 21 మంది పట్టుబడ్డారు. వారిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 18 మందికి ఒకొక్కరికి రూ.2 వేలు జరిమానా, ఓ వ్యక్తికి రూ.3 వేలు, ఇద్దరికి రూ.5 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

రామాయంపేటలో..

రామాయంపేట(మెదక్): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష పడినట్లు ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. రామాయంపేట పట్టణానికి చెందిన ప్రభాకర్, నార్సింగికి చెందిన భూపాల్‌రెడ్డి మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం మెదక్‌లోని స్పెషన్ మొబైల్ కోర్టులో హాజరుపర్చారు. విచారణ తర్వాత మేజిస్ట్రేట్ కల్పన భూపాల్‌రెడ్డికి రూ.వేయి జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష, ప్రభాకర్‌కు ఒక రోజు జైలుశిక్ష, రూ.వేయి జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి సాగు కలకలం

చిన్నశంకరంపేట(మెదక్): గంజాయి సాగు చేస్తూ విక్రయిస్తున్న వ్యక్తిని చేగుంట పోలీసులు అరెస్ట్ చేయడంతో చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ గ్రామంలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన చాకలి సత్తయ్య గంజాయి సాగుచేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. చేగుంట పోలీసులు చిన్నశంకరంపేట పరిశ్రమలో పనిచేసేందుకు వచ్చిన ముకేష్ పాతక్‌ను చేగుంటలో అరెస్ట్ చేసి విచారించగా సత్తయ్య పేరు వెలుగులోకి వచ్చింది. దీంతో చేగుంట ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్.కొండాపూర్‌లోని నిందితుడు సత్తయ్య ఇంట్లో సోదాలు చేయగా 500 గ్రాముల గంజాయిని కొనుగొన్నారు. విషయం గ్రామంలో తెలియడంతో వ్యవసాయ పనులు చేసే సత్తయ్య గంజాయి విక్రయించడం చర్చనీయంశంగా మారింది. కాగా సత్తయ్యను చేగుంట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

చేర్యాల(సిద్దిపేట): హాస్టళ్ల మూసివేతకు కారణమవుతున్న మద్దూరు ఎస్సీ హాస్టల్ వార్డెన్ రమణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్‌చేశాడు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను వెళ్లిగొట్టి హాస్టళ్ల మూసివేతకు కారణమైన వార్డెన్‌పై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. సరైన ఆధారాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ చేర్యాల డివిజన్ అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి సుద్దాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

కొల్చారం(నర్సాపూర్): అనుమానాస్పద స్థితిలో పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.1.60 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటన మండలంలోని రంగంపేట గ్రామంలో గురువారం వెలుగు చూసింది. బాధితుడు మంగలి నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో సెలూన్ షాపు నడిపే నర్సింహులు రాత్రి ఇంటికి చేరుకొని 10 గంటల సమయంలో ఆరు బయట కూర్చుని భోజనం చేస్తున్నారు. ఇంటి వెనుక భాగంలో ఒక్కసారిగా మంటలు అంటుకొని ఇల్లు కాలి బూడిదైంది. బీరువాలో దాచిని రూ.80 వేల నగదు కాలి బూడిదైంది.


అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన పూరిల్లు

ప్రజల సహకారంతో సిద్దిపేటకు ఖ్యాతి

- బల్దియా మూడు ఐఎస్‌ఓలు సాధించడంపై హర్షం
- సాధించిన ఘనత మీకే అంకితం
- మీ భాగస్వామ్యం అపూర్వం
- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు


సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రజలు చాలా గొప్పోళ్ళు.. ఒక ప్రజా ప్రతినిధిగా నేను పిలుపు ఇస్తే సంపూర్ణ మద్దతు ఇస్తారు. ప్రజల భాగస్వామ్యం, సహకారంతోనే ఇప్పటి వరకు సిద్దిపేట జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఖ్యాతి సాధించింది. ఇప్పుడు ఒకేసారి మూడు ఐఎస్‌ఓలు సాధించిన బల్దియాగా నిలిచింది. ఇది మీ గొప్పతనం, మీకు చేతులు ఎత్తి దండం పెడుతున్నా. మీ సహకారం ఎప్పటికి ఇలాగే ఉండాలని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యా శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో సిద్దిపేట మున్సిపాలిటీకి మంత్రి మూడు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ.. ఆరోగ్య, స్వచ్ఛ, హరిత సిద్దిపేటగా మారడంలో ప్రజల కృషి ఉందన్నారు. ఈ ఖ్యాతి సిద్దిపేట ప్రజలకు అంకితమన్నారు. సిద్దిపేట గౌరవం, ప్రతిష్ట మరింత పెరిగిందన్నారు. దేశానికి ఆదర్శంగా సిద్దిపేట బల్దియా నిలవడంలో పాలకవర్గం, అధికారులు, ప్రజల, ముఖ్యంగా ఆర్పీలు, అంగన్ వాడీ, పారిశుధ్య సిబ్బంది ఇలా అందరి కృషి ఉందన్నారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ప్రజల అభిమానాన్ని మరింత పొందాలని సూచించారు. అవార్డులు, సర్టిఫికెట్లు బాధ్యతలను మరింతగా పెంచుతాయన్నారు. సిద్దిపేట బల్దియా ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని, బ్యాంక్‌ల్లో బల్దియాకు సంబంధించిన నిధులు నిల్వ ఉండే స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్స్, వైస్ చైర్మన్ కనకరాజు, కమిషనర్ రవీందర్ రెడ్డి, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు రేణుక, కవిత, శ్రీదేవి, పూర్ణిమ, దీప్తి, శ్రీలత, జయ, బాల్ లక్ష్మీ, శోభారాణి, సుందర్, సాయి, మల్లికార్జున్, యోగి, వజీర్, విఠోబ, శ్రీనివాస్ యాదవ్, బ్రహ్మం, వినోద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హరిత, వ్యర్థాల నిర్వహణ, ఆరోగ్య విభాగాల్లో ఆదర్శం

సిద్దిపేటజోన్: రాష్ట్ర బల్దియాలకు ఆదర్శంగా ఉన్న సిద్దిపేట మరో అడుగు ముందుకేసింది. అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ అందుకనుగుణంగా పౌర సేవలను సముచితంగా అందిస్తున్న సిద్దిపేట స్పెషల్ మున్సిపాలిటీ ట్రిపుల్ ధమాకా సాధించింది. సమర్థ హరిత, వ్యర్థాల నిర్వహణలో ఐఎస్‌ఓ 140001, ఆరోగ్య, సంరక్షణ ఆచరణలో ఐఎస్‌ఓ 45001, సదుపాయాల కల్పన, విశ్వసనీయతతో కూడిన పౌర సేవలకుగాను మూడు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు సొంతం చేసుకుంది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యాశాఖ మంత్రి టి.హరీశ్‌రావు చేతుల మీద బల్దియా పాలకవర్గం, అధికారులు, సిబ్బంది ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు.


సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం

కౌలు రైతు ఆత్మహత్య

అక్కన్నపేట(హుస్నాబాద్): అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకొనేందుకు పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన కౌలు రైతు ఇసంపల్లి భూమయ్య(60)కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారి వివాహాల కోసం తన పొలం అమ్మేశాడు. అప్పటి నుంచి అదే గ్రామానికి చెందిన ఇసంపల్లి శ్రీనివాస్‌కు చెందిన పదెకరాలు కౌలుకు తీసుకున్నాడు. పంటల సాగు కోసం రూ.5 లక్షలు అప్పు చేశాడు. అయితే ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. అప్పులు తీర్చే మార్గం కానరాక మనస్తాపానికి గురై ఈనెల 10వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కనకవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి


డబుల్ బెడ్రూం ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్ రావు

సిద్దిపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మనబడి పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చెందాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. గురువారం మండల పరిధిలోని రాఘవాపూర్ పిట్టలవాడలో 13 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, బస్తీ దవాఖానా, ఏకలవ్య, మాల కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన, లైబ్రరీ, మన ఊరు మనబడిలో భాగంగా నిర్మించిన డైనింగ్ హాల్, అదనపు తరగతి గదులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి చందర్‌రావు, జెడ్పీటీసీ శ్రీహరిగౌడ్, సర్పంచ్ రమేశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రావు, వైస్ ఎంపీపీ యాదయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యాదయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

- స్కూటీ, బంగారు గుండ్ల తాడు, సెల్‌ఫోన్ సీజ్
- వివరాలు వెల్లడించిన సీఐ వేణుగోపాల్ రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వేణుగోపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధురాలికి స్కూటీపై లిఫ్ట్ ఇస్తామని చెప్పిన ఇద్దరు తీసుకెళ్లి ఆమెకు మద్యం తాగించారు. ఆమె ఒంటిపై ఉన్న తులం బంగారు గుండ్ల తాడు ఎత్తుకెళ్లిన ఘటనలో పోలీసులు ఇద్దరిని రిమాండ్ తరలించారు. నిందితుల్లో ఒకరు మహిళ కావడం గమనార్హం. గురువారం సాయంత్రం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వేణుగోపాల్ రెడ్డి వివరాలను వెల్లడించారు. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామానికి చెందిన గాలెమ్మ ఈ ఏడాది జనవరి 13వ తేదీన బచ్చుగూడెంలో ఉండే కూతురు ఇంటికి వెళ్లింది. తిరిగి రామేశ్వరంబండకు నడుచుకుంటు వెళ్తోంది. ఈ క్రమంలో ఇద్దరు వ్యక్తులు బ్లూ కలర్ స్కూటీ పై వచ్చి లిఫ్ట్ ఇస్తామని చెప్పి వృద్ధురాలిని తీసుకెళ్లి మద్యం తాగించారు. ఆపై ఆమె ఒంటిపై ఉన్న తులం బంగారు గుండ్ల తాడును తీసుకొని పరారయ్యారు. దీంతో బాధితురాలు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం పటాన్‌చెరు పట్టణం నవపాన్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానం వచ్చి స్కూటీపై వచ్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా జనవరి 13వ తేదీన వృద్ధురాలి బంగారు గొలుసు చోరీ చేసింది తామేనని ఒప్పుకున్నారు. అయితే పట్టుబడిన నిందితురాలు లంబోది మంజులది శంకర్‌పల్లి మండలం మహారాజపేట్, మరో వ్యక్తి పొడుగు కృష్ణది శంకర్‌పల్లి మండలం గోపులాపురం గ్రామస్తుడిగా గుర్తించారు. కృష్ణపై 2019లో పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధి రుద్రారం వద్ద జరిగిన డబుల్ మర్డర్ కేసు లో నిందితుడు. సంగారెడ్డి టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒకటి, వికారాబాద్ జిల్లాలో మరో మర్డర్ కేసు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 2019లో కృష్ణపై సంగారెడ్డి టౌన్ పోలీసులు పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఏడాది జైలు శిక్ష అనుభవించాడు. నిందితుల నుంచి స్కూటీ, తులం బంగారు గుండ్ల తాడు, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో క్రైం సీఐ బీసన్న,ఎస్ఐ ప్రసాద్ రావు, ఎస్ఐ దుర్గయ్య, క్రైం కానిస్టేబుళ్లు షాకీర్, సతీశ్, మహిళా కానిస్టేబుల్ ఉమ పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించాడని..

- ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలి బైఠాయింపు
- మనస్తాపంతో పురుగు మందు తాగిన ప్రియుడు


ప్రియుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న యువతి

మద్దూరు(హుస్నాబాద్): ప్రేమించిన వ్యక్తి పెండ్లికి నిరాకరించడంతో ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు బైఠాయించింది. ఈ సంఘటన దూల్మిట్ట మండలం కూటిగల్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేబర్తి గ్రామానికి చెందిన ఉచ్చెతుల అరుణ చేర్యాల పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుంది. కాగా అదే కళాశాలలో దూల్మిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన జోగిని వంశీ చదువుతున్నాడు. ఇద్దరూ నాలుగేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెండ్లి చేసుకోవాలని అరుణ కోరడంతో వంశీ నిరాకరించాడు. దీంతో తనను పెండ్లి చేసుకోవాలని కోరుతూ వంశీ ఇంటి ఎదుట బైఠాయించింది. ప్రియురాలు ఇంటికి వచ్చి బైఠాయించడంతో మనస్తాపానికి గురైన వంశీ తమ వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష

వివరాలు వెల్లడించిన గజ్వేల్ ఏసీపీ రమేశ్

గజ్వేల్‌రూరల్: సహజీవనం చేస్తున్న మహిళను హత్యచేసిన నిందితుడికి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష, జరిమానా విధించినట్లు గజ్వేల్ ఏసీపీ రమేశ్ తెలిపారు. గురువారం వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన పూజారి అరుణ(35) భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో కూలీ పనులు చేస్తూ జీవనం సాగించింది. కాగా ఇదే జిల్లా బొల్లనపల్లికి చెందిన లారీ డ్రైవర్ ఆకుల శ్రీనివాస్ తన భార్య చనిపోయిందని చెప్పి పూజారి అరుణను పరిచయం చేసుకొని ఆమెతో సహజీవనం చేశాడు. ఈ క్రమంలో పూజారి అరుణ తన సోదరులు ఉంటున్న గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌కు వచ్చి ఓ అద్దె ఇంటిలో ఉండేది. ఆకుల శ్రీనివాస్ కూడా ఆమెతో కలిసి ఉండేవాడు. 2021 జూన్ 20న అరుణ తన అక్క కొడుకు వివాహం ఉండటంతో వరంగల్ వెళ్లి వచ్చింది. ఈ విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో అరుణ నిద్రిస్తున్న సమయంలో శ్రీనివాస్ ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించి ఇంటికి గొళ్లెం పెట్టి వెళ్లిపోయాడు. మంటలు తాళలేక అరుణ బిగ్గరంగా అరవడంతో స్థానికులు అక్కడకు చేరుకుని బాధితురాలి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. గజ్వేల్ ప్రభుత్వాసుపత్రిలో అరుణకు ప్రథమ చికిత్స అనంతరం గాంధీకి తరలించారు. 2021 జూన్ 21న అప్పటి గజ్వేల్ ఎస్ఐ అశోక్ కాలిన అరుణ వాంగ్మూలం తీసుకొని కేసు దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అరుణ మృతి చెందడంతో హత్యానేరం కింద కేసును మార్చారు. విచారణ చేపట్టిన అప్పటి సీఐ వెంకటేశ్ నిందితుడు శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అనంతరం వచ్చిన అప్పటి సీఐ ఆంజనేయులు కేసు విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. సిద్దిపేట ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్‌కోర్టులో విచారణ జరిగింది. ఇరువురి వాదనలు విన్న తర్వాత ఆకుల శ్రీనివాస్‌పై నేరం రుజువైనందున జడ్జి డాక్టర్ టి.రఘురామ అతడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు. నిందితుడికి జైలు శిక్ష పడేలా చేసిన సిబ్బందిని సీపీ శ్వేత అభినందించారు.

వివాహమైన 20 రోజులకే..

- రైలు కిందపడి వరుడు ఆత్మహత్య
- మృతుడు శివ్వంపేట మండలం దొంతివాసి
- దర్యాప్తు చేపట్టిన కామారెడ్డి రైల్వే పోలీసులు


వికాస్ (ఫైల్)

తూప్రాన్: వివాహమైన 20 రోజులకే వరుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ పరిధి బ్రాహ్మణపల్లి రైల్వేగేటు సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. కామారెడ్డి రైల్వే ఎస్ఐ తావునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన తాటి వికాస్(30) సాఫ్ట్‌వెర్ ఉద్యోగి. ఈ ఏడాది జనవరి 26వ తేదీన మేడ్చెల్‌కు చెందిన యువతితో వివాహం జరిగింది. కుటుంబ సభ్యులతో సరదాగా ఉన్న వికాస్ బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. గురువారం తెల్లవారు జామున బ్రాహ్మణపల్లి రైల్వేగేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. అయితే మృతుడి కుటుంబ సభ్యులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

లద్నూరులో క్షుద్రపూజల కలకలం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని లద్నూరులో క్షుద్రపూజల కలకలం లేపాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు జీడికంటి రవిరాజు పొలం లద్నూరు-బండనాగారం గ్రామాల మధ్యలో ఉంది. అయితే గుర్తు తెలియని వ్యక్తులు అతడి వ్యవసాయ బావి వద్ద బుధవారం రాత్రి క్షుద్రపూజలు చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. క్షుద్రపూజలు చేసిన స్థలంలో కోడి, కొత్త బట్టలు, నిమ్మకాయలు, పసుపు, కుంకుమ కనిపించడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

అరకిలో గంజాయి స్వాధీనం

చేగుంట(తూప్రాన్): గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. చేగుంటలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. చిన్న శంకరంపేట మండలం ఎస్.కొండాపూర్ గ్రామానికి చాకలి సత్తయ్యకు గంజాయి సేవించే అలవాటు ఉంది. తన పొలంలో గంజాయి మొక్కలు పెంచి కొంత విక్రయించాడు. రెండేళ్ల క్రితం చిన్నశంకరంపేట పద్మనాభస్వామి గుట్ట వద్ద పాతక్ ముఖేశ్‌తో కలిసి చేగుంట పరిసరాల్లోని పరిశ్రమల వద్ద గంజాయి అమ్మేవాడు. గురువారం గంజాయి విక్రయించేందుకు చేగుంటకు వచ్చిన ముఖేశ్‌ను ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ సమీపంలో, సత్తయ్యను చేగుంట బస్టాండ్ వద్ద పట్టుకున్నారు. వారి నుంచి 500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని, తహసీల్దార్ సమక్షంలో పంచనామా నిర్వహించి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


తెల్గోల్ల రమేశ్ గౌడ్ (ఫైల్)

సదాశివపేటరూరల్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురువారం సదాశివపేట సీఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్ మండలంలోని మునిదేవుని పల్లి గ్రామానికి చెందిన తెల్గోల్ల రమేశ్ గౌడ్(30) ఓ ప్రైవేట్ నర్సరీలో పనిచేస్తున్నాడు. బుధవారం ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి నుంచి పెద్దాపూర్ వెళ్తున్నాడు. గుడ్‌లక్ హోటల్ సమీపంలో బైకును కారు బలంగా ఢీ కొట్టడంతో రమేశ్‌గౌడ్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే సంగారెడ్డిలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

తొనిగండ్లలో కార్డన్ సెర్చ్


మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): మండలంలోని తొనిగండ్ల గ్రామంలో గురువారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ సర్టిఫికెట్, ఆర్‌సీ, బీమా పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకై దాతలు ముందుకు రావాలన్నారు. పలువురు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రంజిత్, గ్రామ ఉపసర్పంచ్ సుజాత, లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల నిర్వాహకులపై చర్యలు తీసుకోండి

ప్రజాసంఘాల నాయకుల డిమాండ్


ఇటుకబట్టీలను పరిశీలిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నారాయణఖేడ్: ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు వచ్చిన ఒడిశాకు చెందిన వలస కూలీలపై వేధింపులు, మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిర్వాహకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్యం, సీఐటీయూ, కేవీపీఎస్, డీవైఎఫ్ఐ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నిజాంపేట మండలం దర్గా తండా సమీపంలోని ఇటుక బట్టీలను సందర్శించారు. అనంతరం వారు మాట్లాడారు. ఇటుక బట్టీల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేకుండా బట్టీలను నిర్వహించడం దారుణమన్నారు. ఇటుక బట్టీల్లో బాల కార్మికులతో పని చేయిస్తున్న కార్మికశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా ఇటుక బట్టీలపై దాడులు చేపట్టి, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఒడిశా నుంచి కాంట్రాక్టర్ల ద్వారా కార్మికులను తెచ్చి దర్గా తండా వద్ద బట్టీల నిర్వాహకులు పనులు చేయించడమే కాకుండా లైంగిక వేధింపులకు గురిచేయడం దారుణమన్నారు. సంబంధిత మైనింగ్, కార్మిక, రెవెన్యూ, విద్యుత్ శాఖలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు.

పోలీసులు చితకబాదిన ఘటనలో..

- గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు
- ఆరోగ్యం క్షీణిస్తుందన్న భార్య
- ఘటన బాధ్యులను బదిలీచేసిన ఎస్పీ


గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఖదీర్

మెదక్‌జోన్: దొంగతనం నెపంతో పోలీసులు చితకబాదిన ఖదీర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఏడాది జనవరి 29వ తేదీన మెదక్ పట్టణంలోని అరబ్‌గల్లీలో గుర్తు తెలియని వ్యక్తి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు తెంపుకెళ్లాడు. ఈ నేపథ్యంలో పట్టణంలోని పిట్లంబేస్ వీధికి చెందిన మహ్మద్ ఖదీర్ బతుకు దెరువు కోసం హైదరాబాద్ వెళ్లాడు. చోరీ చేసిన వ్యక్తి సీసీ పుటేజ్‌లో ఖదీర్‌లాగా ఉన్నాడన్న ఆరోపణతో పోలీసులు అతడిని జనవరి 25వ తేదీన అదుపులోకి తీసుకొన్నారు. ఐదు రోజులపాటు ఇంటరాగేషన్ చేసి ఫిబ్రవరి 2వ తేదీన వదిలిపెట్టారు. పోలీసుల దెబ్బలకు తీవ్ర అస్వస్థతకు గురైన ఖదీర్ చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. బలమైన దెబ్బలు తగలటంతో ఖదీర్‌ను వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అప్పటికే ఈ విషయం మీడియాలో ప్రసారం కావటంతో బాధితుడిని హైదరాబాద్‌లోని రెనోవా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. మూడు రోజుల పాటు అక్కడ చికిత్స జరిగింది. వైద్య ఖర్చు పోలీసుశాఖ భరించినట్లు ఖదీర్ కుటుబీకులు తెలిపారు. కాగా ఈనెల 12వ తేదీన ప్రైవేట్ ఆస్పత్రి నుంచి గాంధీ ఆస్పత్రికి పంపించారు. కాగా ఖదీర్ ఆరోగ్యం క్షీణిస్తునట్లు అతడి భార్య సిద్దేశ్వరి రోదిస్తూ చెప్పింది. ప్రస్తుతం ఐసీయూలో ఉన్నట్లు తెలిపింది.

ముగ్గురు పోలీసు అధికారుల బదిలీ

దొంగతనం నెపంతో ఖదీర్‌ను చితకబాదిన ఘటనలో మెదక్ పట్టణ ఎస్ఐతోపాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. పట్టణ ఎస్ఐ రాజశేఖర్ డీసీఆర్బీకి అటాచ్ చేయగా, కానిస్టేబుల్ పవన్ కుమార్ రేగోడ్, ప్రశాంత్‌ను పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీచేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు.